క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతబొమ్మాళి: ఫీడర్ నిర్వహణ, చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎం.శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పలాస: మండల పరిషత్ సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరిగే ఈ బడ్జెట్ సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

బెంచీల వితరణ



బెంచీలపై కూర్చున్న స్థానికులు

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పంచాయతీ రెడ్డిక మరువాడ గ్రామంలో విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఏడు బెంచీలను సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి శుక్రవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సూరాడ దాసురాజు, ఉప సర్పంచ్ సుగ్గు సీతయ్యరెడ్డి, వార్డు మెంబర్ తిప్పాన వసంతకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న మండల సర్వసభ్య సమావేశం

కంచిలి: ఈ నెల 8న కంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ఉపాధ్యాయుడు కామేష్‌రెడ్డి

కంచిలి: మండలంలోని డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అర్జునాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బి.కామేష్‌రెడ్డి రూ.10వేలు విరాళాన్ని ఇచ్చారు. ఈ మొత్తాన్ని హెచ్‌ఎం ఉప్పాడ రమేష్‌కుమార్‌కు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న బీసీ సామాజిక చైతన్య సభ

టెక్కలి: ఈ నెల 7న బీజేపీ ఆధ్వర్యంలో విశాఖలో జరగనున్న బీసీ సామాజిక చైతన్య సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మన్‌కీ బాత్ రాష్ట్ర కన్వీనర్ వంజంగి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నారాయణవలస సంత వేలం ఖరారు

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గురువారపు సంత వేలంపాట 2024-25 ఏడాదికి గాను రూ.68 లక్షల50వేలకు ఖరారైంది. కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ అధ్యక్షతన వేలం నిర్వహించగా అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన రొంగలి సింహాచలం రూ.68.50 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది రూ.90.50 లక్షలకు పాట పాడారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మ, సంత కార్యదర్శి రుణీషా పాల్గొన్నారు.

చింతామణి అమ్మవారికి బంగారు కానుకలు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి పిరియా రవికుమార్, ప్రశాంతి దంపతులు మొక్కుబడులు తీర్చేక్రమంలో భాగంగా శుక్రవారం ముప్పావు తులం బంగారు కానుకలను వితరణగా అందించారు. శుక్రవారం గుడి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడిరైతులకు ఆసరాగా కిసాన్ క్రెడిట్ కార్డులు

పలాస: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ పలాస ఏ.డి. చంద్రశేఖర్ కోరారు. పలాస మండలం బొడ్డపాడు సబ్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస మండలంలో 13,800 పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశామని చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డుతో రూ.3లక్షలు వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

శాసనాం విద్యార్థి ప్రతిభ

ఇచ్ఛాపురం రూరల్: సత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో పాత శాసనాం ఉన్నత పాఠశాలకు చెందిన సమీర ప్రథమ స్థానంలో నిలిచిందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, నంది అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డి, హెచ్‌ఎం ఎ.చిరంజీవిరావులు విద్యార్థినికి బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

బడి బువ్వ.. వహ్వా!



> నాణ్యమైన చదువుతోపాటు రుచికరమైన ఆహారం...
>
> నా పేరు కొమ్మన వర్షిత. కంచిలి మండలం మకరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన భోజనం అందుతోంది. బలవర్ధకమైన, పోషకాలున్న ఆహారం పెడుతుండటంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తోంది. దీనివల్ల పూర్తి ఏకాగ్రతతో చదవగలుగుతున్నాం

జగనన్న గోరుముద్ద మెనూ...



సోమవారం: కారం పొంగల్, ఉడికించిన గుడ్డు
మంగళవారం: పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం: వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం: నిమ్మకాయ పులిహోర, ఉడికించిన గుడ్డు, రాగి జావ
శుక్రవారం: ఆకు కూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరు శనగ చిక్కీ
శనివారం: తీపి పొంగల్, పప్పు, రసం, రాగి జావ

- సర్కారు బడిలో మధ్యాహ్న భోజనంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి
- చిన్నారుల ఆరోగ్యానికి, నాణ్యతకు పెద్దపీట
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు





మకరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కంచిలి మండలంలో పాఠశాలల వివరాలు..	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
	67	23	10	6562

కంచిలి:

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినాలంటే విద్యార్థులు వెనుకంజ వేసేవారు. చాలామంది ఇళ్లకు వెళ్లిపోవడమో.. ఇంటి నుంచి క్యారేజీ తీసుకురావడమో చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. విద్యార్థులకు సంపూర్ణ పోషకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని సమూలంగా మార్చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట పోషక విలువలున్న ఆహారాన్ని ప్రతిరోజూ విద్యార్థులకు అందిస్తూ నాణ్యమైన భోజనం పెడుతున్నారు. దీంతో ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తమ పిల్లలకు నాణ్యమైన భోజనం పెడుతున్న జగనన్నకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

> కడుపునిండా తింటున్నాం..
>
> 
>
> మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. భోజనంతో పాటు చిక్కీ ఇస్తున్నారు. సాయంత్రం ఇంటికెళ్లే వరకు ఆకలి తెలియట్లేదు. గతంలో కంటే ఇప్పుడు మధ్యాహ్న భోజనం బాగుంది.
>
> – ఈశ్వర్ పట్నాయక్, 6వ తరగతి, మకరాంపురం జెడ్పీ హైస్కూల్

> పౌష్టికాహారం అందిస్తున్నారు..
>
> 
>
> గుడ్లు, ఆకు కూరలు, ఉదయం వచ్చేటప్పుడు రాగి జావ, శనగ చిక్కీ వంటివి ఇస్తున్నారు. ఇవన్నీ పోషకాలతో కూడిన ఆహారాలు. పాఠశాలలో భోజనం బాగుంది.
>
> – మల్ల ఆశ్రిత, 6వ తరగతి, మకరాంపురం హైస్కూల్



మఠంసరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన వంటకాలు

'స్థానిక సంస్థలను నాశనం చేసింది చంద్రబాబే'



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబునాయుడిదేనని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. శుక్రవారం నందిగాం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో స్థానిక సంస్థల అధికారాలను జన్మభూమి కమిటీకు కట్టబెట్టి, ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయించి, స్థానిక సంస్థలను నాశనం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, నాయకులపై ప్రేమ పుట్టుకొస్తోందని, అయినా బాబుని నమ్మే పరిస్థితిలో జనం లేరని స్పష్టం చేశారు. బీసీలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీ కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన సీఎం జగన్ వెంటే జనం నడుస్తారని స్పష్టం చేశారు.

జానపద కళాకారుడికి సత్కారం



ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్: జానపద కళారంగంలో తిప్పన ధనుంజయరెడ్డి జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కల్చరల్ వింగ్ జాయింట్ సెక్రటరీ తిప్పన ధనుంజయరెడ్డి ఇటీవల తెలంగాణలో ఇటీవల జానపద కళల్లో నంది అవార్డు అందుకున్న నేపథ్యంలో శుక్రవారం టి.బరంపురంలో ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, సంతోష్ మండలా, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దక్కత నూకయ్యరెడ్డి, రంగాల జానీ తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూడండి



మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: సామాజిక పింఛన్లను మన రాష్ట్రంలో ఎంత ఇస్తున్నామో.. తెలంగాణ, ఒడిశా వంటి పొరుగు రాష్ట్రాల్లో ఎంత ఇస్తున్నారో ఒక్కసారి గమనించాలని మంత్రి సీదిరి అప్పలరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3వేలు చొప్పున పింఛన్లు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24వవార్డు పురుషోత్తపురంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 వార్డుల పరిధిలో కొత్తగా 96 పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు బోర చంద్రకళ, బడగల సుజాత, బళ్ల రేవతీశ్రీనివాస్, శిష్టు గోపి, అంబటి ఆనందరావు, గౌరీ త్యాడి, మార్పు యుగంధర్, దున్న సత్యం, బోనెల రాము, గూన మన్మథరావు, హేమారావు బెహరా, కొవ్వూరు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ల పండగ

ఊరూవాడా పింఛన్ల పండగ నెలకొంది. పెన్షన్లను రూ.3వేలకు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం: లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు, చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



టెక్కలి: గ్రామ సచివాలయం-1 వద్ద పింఛన్లు అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి, ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాత



సోంపేట: బారువ మేజర్ పంచాయతీలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద



కోటబొమ్మాళి: కొత్తపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంపాత్రుని సావిత్రి



కోటబొమ్మాళి: కమలనాభపురంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, లబ్ధిదారులు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురంలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ బోర పుష్ప, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి



సందిగాం: స్వామిపేటలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు



పలాస: బొడ్డపాడులో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ ఉంగ ప్రవీణ, ఉంగ సాయికృష్ణ



కాశీబుగ్గ: వలంటీర్ జయలక్ష్మి నుంచి కొత్త పింఛన్ అందుకుంటున్న జైనాబీన్



కవిటి: లండారిపుట్టుగలో మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు తలగాన లక్ష్మికి పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కంచిలి: జాడుపూడి శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కోటబొమ్మాళి/సోంపేట/టెక్కలి/కవిటి/కంచిలి/సంతబొమ్మాళి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతకు విశేష స్పందన లభిస్తోందని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం కస్తూరిపాడు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి సిబ్బంది పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో తిలారు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మెండ మణీషా, ఈఓ శరత్‌చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సోంపేటలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ధనలక్ష్మి , వైద్యసిబ్బంది పాల్గొన్నారు. టెక్కలి మండలం లింగాలవలసలో మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఎంపీడీఓ సీహెచ్.లక్ష్మీబాయి శిబిరాన్ని ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రసాదరావు పర్యవేక్షించారు. కవిటి మండలం లంగరాపుట్టుగలో శిబిరాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ప్రారంభించారు. కంచిలి మండలం జాడుపుడిలో నిర్వహించిన శిబిరాన్నిఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, పార్టీ నేత ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ పలికల ద్రాక్షాయణి, ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ, పలికల జయరాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సంతబొమ్మాళి మండలం ఉమ్మిలాడలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి ప్రారంభించారు. బోరుభద్ర పీహెచ్‌సీ డాక్టర్ అవని, దేవీవనిత పాల్గొన్నారు.



కస్తూరిపాడు జగనన్న సురక్షా కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి



టెక్కలి: లింగాలవలసలో నిర్వహించిన వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్యులు, నాయకులు



సంతబొమ్మాళి: వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి

రేపు ఆత్మీయ సమ్మేళనాలు

కాశీబుగ్గ: పలాస మండలం కంట్రగడ గ్రామంలో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. కళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మందస మండలం బృందావనం రియల్ వెంచర్ వద్ద ఈ నెల 7న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు.